

ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

లింగోజిగూడ కార్పొరేటర్‌పై బీజేపీ నేతల ఫిర్యాదు

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని పోస్ట్ చేయడంతో పాటు, ఫొటోను మార్ఫింగ్ చేసిన లింగోజిగూడ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు చేపట్టాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జమ్మూకశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు ఎల్బీనగర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేసినట్లు ఫొటోలు మార్ఫింగ్ చేసి, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్‌చేసి బీజేపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో పాటు డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, కృష్ణంరాజు, కిరణ్, శ్రవణ్‌గౌడ్, దామ రాకేష్‌యాదవ్, సతీష్, శివరామ్, గిరీష్, టింకు ఫిర్యాదు చేశారు.



ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కొత్తపేట : కాశ్మీర్ ఉగ్రదాడికి బీజేపీ నాయకులు చేపట్టిన నిరసన ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా వేదికపై బీజేపీ కార్పొరేటర్లు మోదీ దిష్టి బొమ్మ దహనం చేశారని తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్ లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి పోస్ట్ చేశారని శుక్రవారం సాయంత్రం బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎల్బీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడంతో దేశమంతా ఆందోళన, ఆవేదనలో ఉన్న తరుణంలో కాంగ్రెస్ నాయకుడు, కార్పొరేటర్ ఫొటోలను మార్ఫింగ్ చేయడం ఏమిటని నాయకులు ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రల్లెం రవీందర్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు రంగారెడ్డి, కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి, నాయకులు భాస్కర్, శ్రీను, పాతూరి శ్రీధర్‌గౌడ్, రఘుగౌడ్, సాయికరణ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలి



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ద్వారకమాయినగర్‌కాలనీలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలేదని కాలనీవాసులు కార్పొరేటర్‌కి సూచించారు. కాలనీవాసులు విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పారిశుధ్య కార్మికులు పరిసరాలను ప్రతినిత్యం పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



రాజ్యాంగంపై ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా జైబాపూ, జైభీం, జై సంవిధాన్

హయత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాం గ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం తుర్కయంజాల్ చౌరస్తా వద్ద జైబాపూ, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ యువ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగంపై ప్రమాణం చేశారు. అనంతరం గ్రామంలో పాదయాత్ర చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ, గాంధీ, బాపు ఆలోచనలను కొనసాగింపు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మంకలా దాసు, సామభీం రెడ్డి, కాకుమాన్ సునీల్, కుంట గోపాల్‌రెడ్డి, యశ్వంత్, మర్రి మహేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు, గుండా శ్రీశైలం, మధు, శ్యామల, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీసీసీబీ చైర్మన్ సత్తయ్యకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, యాదిరెడ్డి

రైతుల సమస్యలను పరిష్కరించండి

హయత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు జరిగేటట్లు చూడాలని కోరుతూ శుక్రవారం రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి ముత్యా ల యాదిరెడ్డితో కలిసి డీసీసీబీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినట్లు ఇప్పటి వరకు రైతులకు సంపూర్ణ రైతు భరోసా అందలేదని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ అసలే జరగలేదు. రేషన్ కార్డు, ఆధార్ కార్డుల్లో తప్పులు ఉన్నాయని బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, బాల్‌రెడ్డి, బాలయ్య, జంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మలేరియా దినోత్సవం



ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మలేరియా డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం హయత్‌నగర్‌లో అంతర్జాతీయ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ దోమల నివారణ ద్వారానే మలేరియా వ్యాధిని అరికట్టవచ్చునని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ డిపార్టుమెంటుకు చెందిన అధికారి రవీందర్, కుమార్, బీజేపీ నాయకులు బండారు భాస్కర్, గంగని శ్రీను, పారంద మహేష్ పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వీఎంహోం వాకర్స్ అసోసియేషన్, పీవీటీ మర్చంట్స్ అసోసియేషన్‌ల ప్రతినిధులు



కొవ్వొత్తుల ర్యాలీతో మృతులకు నివాళులర్పిస్తున్న రాక్‌టౌన్‌కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి తదితరులు



ప్లకార్డుల ప్రదర్శనతో ఎల్బీనగర్‌చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ



బడంగ్‌పేట్‌లో నిరసన ర్యాలీలో పాల్గొన్న బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

ఉగ్రదాడులను ఖండించాల్సిందే

- ముష్కరులది పిరికితనంతో కూడిన ఉన్మాద చర్య
- కొవ్వొత్తుల ర్యాలీలు



బాలాపూర్‌లో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న పారిజాతారెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి పిరికిపందల చర్య అని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అన్నారు. అమాయక పర్యాటకులను క్రూరంగా కాల్చిచంపిన పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి భారతీయులంత అండగా నిలువాలన్నారు.

అవంతి విద్యార్థుల ర్యాలీ..

కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి గుంతపల్లి గ్రామంలోని వీధుల్లో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వీఎంహోంవాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఎల్‌బీనగర్ : ఉగ్రదాడిని నిరసిస్తూ సరూర్‌నగర్‌లో వీఎంహోం వాకర్స్ అసోసియేషన్, పీవీటీ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వీఎంహోం చౌరస్తా నుంచి కొత్తపేట చౌరస్తాలోని పీవీటీ మార్కెట్‌వరకు ర్యాలీ నిర్వహించారు.

హుడాసాయినగర్‌కాలనీ సంక్షేమ సంఘం..

వనస్థలిపురం: టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడులో మృతిచెందిన వారి ఆత్మశాంతించాలని కోరుతూ వనస్థలిపురం హుడాసాయినగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

బాలాపూర్‌లో అఖిలపక్ష నేతల నివాళి

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గ్రామ ప్రజలు, అఖిపక్ష నేతల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, కాశ్మీర్ మృతులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ ర్యాలీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు వంగేటి లక్ష్మీలక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరీ జైహింద్‌కుమార్, బండారి మనోహర్ పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ చౌరస్తాలో ఉగ్రదాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు, ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, కోశాధికారి చక్రవర్తుల జగన్మోహనాచార్యులు, ఇతర ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాక్‌టౌన్ కాలనీలో..

మన్సూరాబాద్: ఉగ్రవాదులు జరిపిన దాడిలో మృతిచెందిన హిందువులకు రాక్‌టౌన్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పించారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను నిరసిస్తూ సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు.

హయత్‌నగర్ : పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ హయత్‌నగర్ మండల సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హయత్‌నగర్ మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

చంపాపేట: చంపాపేట డివిజన్‌లోని డిఫెన్స్‌కాలనీలోని పార్కులో శుక్రవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో అసువులు బాసిన వారిని స్మరిస్తూ మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.



హుడాసాయినగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు



హయత్‌నగర్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



చంపాపేట డివిజన్ డిఫెన్స్‌కాలనీలో ఉగ్రదాడిలో అసువులు బాసిన వారిని స్మరిస్తూ మౌనం పాటించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



గులాబీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కొత్తపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ రజతోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాడవాడలా పార్టీ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఆయన పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి వరంగల్ సభకు నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : బీఆర్ఎస్ రజతోత్సవాలలో భాగంగా నాగోల్ డివిజన్ పరిధిలోని చాణక్యపురికాలనీ చౌరస్తా, జైపురికాలనీ చౌరస్తాల వద్ద బీఆర్ఎస్ జెండా పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గులాబీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకుడు అనంతుల రాజారెడ్డి పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం మున్సిపల్ తాజా మాజీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు కమిషనర్‌ను కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
- అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి

మహిళ అదృశ్యం

మన్సూరాబాద్ : ఇంటి నుంచి బయటకు వెళ్లి మహిళ అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తట్టిఅన్నారం ఆర్కేనగర్‌లో మహమ్మద్ రేష్మా తన తల్లి మహమ్మద్ జమాల్బీ(50)తో నివాసం ఉంటుంది. జమాల్బీ పెద్దఅంబర్‌పేట్‌లోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాలులో కూలీగా పని చేస్తోంది. కాగా వారం రోజులుగా తల్లిని పనికి వెళ్లొదంటూ చెప్పడంతో ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 22న సమీపంలోని పాపాయగూడకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన జమాల్బీ ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రేష్మా నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బిడ్డతో సహా తల్లి..

ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన బిడ్డతో సహా తల్లి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్ బండ్లగూడలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో భార్య కోడికంటి వింధ్య(36), కుమార్తె తుమ్మల హాస్య(6)లతో కలిసి తుమ్మల కృష్ణయ్య నివాసముంటున్నాడు. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం వింధ్య తన కుమార్తె హాస్యతో పాటు దుస్తులు, బంగారు ఆభరణాలతో ద్విచక్రవాహనం(టీజీ08పీ2740)ను తీసుకుని వెళ్లింది. ఇంటికి వచ్చి గమనించి కృష్ణయ్య భార్యకు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో చుట్టు పక్కల, బంధువులను ఆరాతీయగా ఆచూకీ లభించలేదు. తన భార్య కనిపించకపోడంలో శ్రీకాంత్ అనే వ్యక్తి ప్రమేయం ఉందంటూ అనుమానిస్తూ ఈ మేరకు శుక్రవారం కృష్ణయ్య నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో సూరజ్ దామోజీ పట్నాజే, డాక్టర్ ఎం.సిద్ధోజీరావు

మన్సూరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్‌ఓడీ సూరజ్ దామోజీ పట్నాజే, ఇంటర్నేషనల్ ఫోర్డ్ ఫెల్లో, డైరెక్టర్ ఆఫ్ ఏపీ స్టడీ సర్కిల్ డాక్టర్ ఎం.సిద్ధోజీరావు పేర్కొన్నారు. నాగోల్ బండ్లగూడలోని జీఎస్ఐ సంస్థలో శుక్రవారం సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్శ మహేష్, మాజీ రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ సూరజ్ దామోజీ పట్నాజే, డాక్టర్ ఎం.సిద్ధోజీరావులు సంస్థ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్థ డీడీజీలు ఎల్‌పీసింగ్, ఎంఎన్ ప్రవీణ్, ఎస్ఎన్ పాత్రో, అజయ్ నిర్వాన్, కేవీ మారుతి, ఎస్ రవి, హెచ్ ఆఫ్ ఆఫీస్ హార్మోన్‌మిశ్రా, జేడీ తారకేశ్వర్‌రావు, రీజినల్ సెక్రటరీ జె.రాజశేఖర్, బి.లింగ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తపేట చౌరస్తాలో కొండా లక్ష్మణ్ కాంస్య విగ్రహం

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీమంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ భారీ కాంస్య విగ్రహాన్ని త్వరలో కొత్తపేట చౌరస్తాలో ప్రతిష్ఠించాలని నిర్ణయించినట్లు పద్మశాలీ సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత తెలిపారు. కొత్తపేట చౌరస్తా సమీపంలోని ఓ కాన్ఫరెన్స్‌హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ జీవితమంతా త్యాగాల మయమన్నారు. కులవృత్తుల సంక్షేమానికి ప్రయోజనం చేకూర్చే సహకారోద్యమ పితామహుడైన కొండా లక్ష్మణ్‌బాపూజీ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని త్యజించారన్నారు. అలాంటి మహనీయుని స్ఫూర్తిని రాబోయే తరాల గుండెలలో నింపవల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉన్నదన్నారు. పద్మశాలీల, చేనేత కళాకారులకు నిలయమైన కొత్తపేటలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. సమావేశంలో భావనరుషి సహకార గృహనిర్మాణ సంఘం చైర్మన్ సీతా ఆంజయనేయులు, అఖిల భారత పద్మశాలీ సత్రాల మార్గదర్శకులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు చిలువేరు కాశీనాథ్, పద్మశ్రీ గజం అంజయ్య, సీనియర్ రాజకీయ నాయకుడు కర్నాటి ధనుంజయ, ప్రొఫెసర్ తడక యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, ఎల్‌పీటీ మార్కెట్ అధ్యక్షుడు కోమటి సత్యనారాయణ, మర్చంట్ కమిటీ అధ్యక్షుడు గంజి కిషోర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సంతోష్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐఎస్‌సదన్ డివిజన్ వాణీనగర్ భోజిరెడ్డి కళాశాల వద్ద గుర్తుతెలియని మృతదేహం(43)ను శుక్రవారం మధ్యాహ్నం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి శవపరీక్షల నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

సంతోష్‌నగర్ పీఎస్ పరిధిలో..

సంతోష్‌నగర్ డివిజన్ గుల్షన్‌ఇక్బాల్ కాలనీలో ఫుట్‌పాత్‌పై పడివున్న గుర్తుతెలియని మృతదేహం(40)ను గమనించిన స్థానికులు సంతోష్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ శివప్రసాద్ దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణ పనులు నిలిపివేత



జయనగర్‌లో నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జయశ్రీ

సైదాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ జయనగర్‌లో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణ పనులను తహసీల్దార్ జయశ్రీ శుక్రవారం నిలిపివేయించారు. యూఎల్‌సీ పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై సీపీఐ ఐఎస్ సదన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి షేక్ మహమూద్ తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె స్పందించి జయనగర్‌లోని అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి పనులు నిలిపివేయించారు.

తల్వార్‌తో భయానక పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు

మన్సూరాబాద్: అక్రమంగా తల్వార్ కలిగి ఉండడమే కాకుండా దానితో సోషల్ మీడియాలో భయభ్రాంతులను చేసేలా పోస్టులు పెట్టిన వ్యక్తిపై నాగోల్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోల్ బండ్లగూడలోని కృషినగర్‌కు చెందిన కారు డ్రైవర్ రాసునూరి ఆంజనేయులు(24) తన పుట్టిన రోజు సందర్భంగా తల్వార్‌తో కేక్‌ను కట్ చేయడమే కాకుండా ఇన్‌స్టాగ్రామ్‌లో వీక్షకులను భయభ్రాంతులను చేసేలా పోస్టులు పెట్టాడు. సమాచారం అందుకున్న నాగోల్ పోలీసులు ఆంజనేయులు ఆచూకీ తెలుసుకుని అతని ఇంట్లో సోదాలు చేయగా అక్రమంగా కలిగి ఉన్న పొడవైన తల్వార్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఆంజనేయులును రిమాండ్‌కు తరలించారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకుల అరెస్ట్

వనస్థలిపురం : గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న 110 గ్రాముల గంజాయినీ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాబాద్ అస్మాన్‌ఘాట్‌కు చెందిన మహమ్మద్ షాబాద్(20), మహమ్మద్ మూస(17), కొత్తపేటకు చెందిన కళ్యాణ్ సాహి మహేందర్ తేజ(19), కుంట్లూర్‌కు చెందిన ఆనంద్ కుమార్(20), మలక్‌పేటకు చెందిన ఈశ్వర్ సాయి వంశీ(19)లు వనస్థలిపురం క్రాంతి హిల్స్ కాలనీలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సేవిస్తున్నారని విశ్వసనీయ సమాచారం పోలీసులకు చేరింది. దీంతో వారిపై దాడి చేసి అదుపులో తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న 110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.